# సాక్షి
## శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 11 । ఆగస్టు । 2024




**చీనీ టన్ను రూ.17 వేలు**

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17 వేలు పలికాయి.



**టమాట కిలో రూ.23**

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.9, సరాసరి రూ.16 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
**33.8°/22.6°**

జిల్లా పరిధిలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### ఆరోగ్యకరమైన దేశాభివృద్ధికి కృషి



ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్

**ధర్మవరం అర్బన్:** ఆరోగ్యకరమైన దేశాభివృద్ధి కోసం పాటుపడుతున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో శనివారం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా జిల్లాలోని ఐదు పంచాయతీలకు స్వచ్ఛభారత్ ట్రాక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించగా.. వాటిని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలంతా స్వచ్ఛ భారత్‌కు సహకరించి వీధులన్నీ శుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త ట్రాక్టర్లు వచ్చినప్పుడు అందులో వేయాలని సూచించారు. జాతిపిత మహాత్మా గాంధీ స్ఫూర్తితో ప్రధాని నరేంద్రమోదీ అధికారం చేపట్టినప్పటి నుంచి నిరాటంకంగా స్వచ్ఛభారత్ కొనసాగిస్తున్నారని తెలిపారు. మెరుగైన పారిశుధ్యంతో ప్రజల ఆరోగ్యానికి హామీ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, ఉపాధ్యక్షుడు సాకే ఓబులేసు, టీడీపీ నాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

### పరవశభరితం.. స్వర మాధుర్యం



సంగీత కచేరీ నిర్వహిస్తున్న ఏలూరు సత్యసాయి భక్తులు

**ప్రశాంతి నిలయం:** సత్యసాయిపై భక్తిభావం చాటుతూ నిర్వహించిన స్వరమాధుర్య సంగీత కచేరీ భక్తులను పరవశింపజేసింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన ఏలూరు సత్యసాయి భక్తులు శనివారం సాయంత్రం సత్యసాయి సన్నిధిలో సంగీత విభావరి నిర్వహించారు. తొలుత బాలవికాస్ విద్యార్థులు సత్యసాయి బోధనలను వివరిస్తూ యజుర్ మందిరం నుంచి సత్యసాయి మహాసమాధి వరకు ర్యాలీ చేశారు. తర్వాత భక్తులు సంగీత కచేరీ నిర్వహించారు.

# రాష్ట్రంలో అరాచక పాలన



పెనుకొండలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



హిందూపురంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక ఆధ్వర్యంలో నిరసన

- అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ కరువు
- సామాజిక న్యాయ మహా శిల్పం శిలాఫలకంపై దాడి టీడీపీ పనే
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

**మడకశిర:** రాష్ట్రంలో చంద్రబాబు అరాచక పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ధ్వజమెత్తారు. చివరకు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు కూడా రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలోని సామాజిక న్యాయ మహాశిల్పంపై జరిగిన దాడిని ఖండిస్తూ ఆయన శనివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆందోళన నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ సామాజిక న్యాయ మహాశిల్పం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని తెలిపారు. ఈ శిలా ఫలకంలోని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేరును ధ్వంసం చేయడం చాలా అన్యాయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రేరేపించడంతోనే టీడీపీ కార్యకర్తలు ఈ ఘటనకు పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగానికి స్వస్తి చెప్పి చంద్రబాబు తనయుడు ఎంచుకున్న రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు. శిలాఫలకంపై దాడి చేసిన వారిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అంబేడ్కర్ విగ్రహాలకు కేంద్ర బలగాలతో రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విగ్రహాలపై దాడులు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నరసింహమూర్తి, వైస్ ఎంపీపీ మూర్తి, కౌన్సిలర్ నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు తిమ్మప్ప, ఫణియాదవ్, మల్లికార్జున, మధు, సుధాకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మడకశిరలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

**ప్రజాస్వామ్యం ఖూనీ**

**హిందూపురం టౌన్:** రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపిక మండిపడ్డారు. సామాజిక న్యాయ మహాశిల్పం శిలాఫలకం ధ్వంసం చేయడాన్ని ఖండిస్తూ శనివారం ఆమె వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి హిందూపురంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, క్షీరాభిషేకం చేశారు. దీపిక మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సామాజిక న్యాయ మహా శిల్పం పేరుతో ఏర్పాటు చేశారని, అయితే ఇది సహించని టీడీపీ నేతలు అక్కడి శిలాఫలకాన్ని ధ్వంసం చేశారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగమణి, నక్కలపల్లి శ్రీరామిరెడ్డి, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, రాము, మన్సూర్, బాలాజీ మనోహర్, కౌన్సిలర్లు మల్లికార్జున, శివ, ఆసిఫ్, నాగేంద్రబాబు, అయూబ్, నాయకులు గుడ్డం దాదు, ఆర్‌కే ఖలీల్, శివశంకర్ రెడ్డి, నవీన్, నరసింహులు, శ్రీరాములు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యోన్మాదులను కఠినంగా శిక్షించాలి

**పెనుకొండ రూరల్:** విజయవాడలోని అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం శిలాఫలకంపై పచ్చమూకలు దాడి చేయడం హేయమని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. శనివారం పెనుకొండలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ సామాజిక న్యాయ మహా శిల్పం శిలాఫలకంపై పచ్చ మూకలు చేసిన రాజ్యోన్మాదం సరైన చర్య కాదన్నారు. దళితులకు మాత్రమే కాకుండా అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేసిన మహనీయుడు అంబేడ్కర్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అద్భుతంగా తీర్చిదిద్ది, జాతికి అంకితం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం విగ్రహాలపై దాడులకు పాల్పడడాన్ని వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ నరసింహులు, కౌన్సిలర్లు సుధాకర్ రెడ్డి, శేషాద్రి, తయూబ్, గణప్ప, బాబు, సద్దాం, యాసిన్, నాయకులు వైశాలి జయశంకర్ రెడ్డి, కొండలరాయుడు, రాము, రామాంజనేయులు, మూర్తి, వెంకటేష్, బోయ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

**దాడి హేయం**

**పరిగి:** అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకం ధ్వంసానికి పాల్పడిన పచ్చమూకలను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రం పరిగిలోని వైఎస్సార్ సర్కిల్‌లో కొవ్వొత్తులను వెలిగించి, శాంతి ర్యాలీ చేశారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, వినతిపత్రాలు అందించారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దళితుల అభ్యున్నతిని గుర్తించి, ప్రతిష్టాత్మకంగా విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం దీన్ని జీర్ణించుకోలేక దళితుల మనోభావాలను అగౌరవ పరిచేందుకు ఇలాంటి నీచ రాజకీయాలకు ఒడిగట్టినట్లు తెలిపారు. విగ్రహాలను భౌతికంగా ధ్వంసం చేసినప్పటికీ ప్రజల్లో అంబేడ్కర్ సేవలను చెరపలేరన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీటీసీలు లక్ష్మీ, లింగమ్మ, మాజీ ఎంపీపీ గోవిందప్ప, ఎస్సీ సెల్ మండల నాయకుడు శంకరప్ప, శివ, రామంజి, కోఆప్షన్ మెంబర్ సలీం, ఎంపీటీసీలు మారుతీరెడ్డి, అంజినప్ప, సింగారెడ్డి, శామీర్, జయచంద్రారెడ్డి, మాజీ డీలర్ మూర్తి, బీఆర్ నారాయణ, గోపి, చౌడప్ప, ధనాపురం సర్పంచ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కొవ్వొత్తులతో నిరసన

**గాండ్లపెంట:** సామాజిక న్యాయ మహాశిల్పం శిలాఫలకం ధ్వంసాన్ని ఖండిస్తూ శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు గాండ్లపెంటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శనతో నిరసన తెలియజేశారు. అనంతరం కదిరి–రాయచోటి ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహించారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, ఎస్సీ సెల్ సభ్యుడు మేకల నరసింహులు, మండల నాయకులు ఇక్బాల్, పురుషోత్తంరెడ్డి, ఫరూక్, బాహుద్దీన్, సత్యంరెడ్డి, శ్రీరాములు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



గాండ్లపెంటలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

## చిరుద్యోగులపై ప్రతాపం

- విధుల నుంచి తాగునీటి పథకం కార్మికుల తొలగింపు



అనిల్, వాటర్‌మెన్



బాలక్రిష్ణ, ఫిట్టర్

**లేపాక్షి:** చిరుద్యోగులపై టీడీపీ నాయకులు ప్రతాపం చూపుతున్నారు. ఎమ్మెల్యే పీఏ ద్వారా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఇద్దరు ఉద్యోగులను విధుల నుంచి తొలగించారు. లేపాక్షి మండలం కోడిపల్లికి చెందిన అనిల్, బాలక్రిష్ణ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం విభాగంలో అనేక ఏళ్లుగా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో ఎలాంటి రిమార్కూ లేదు. అయితే అధికార టీడీపీ నాయకులు ఆ ఉద్యోగులకు వైఎస్సార్‌సీపీ రంగు పులిమి వారి స్థానంలో తమకు కావల్సిన వారిని నియమించేందుకు పావులు కదిపారు. ఎమ్మెల్యే పీఏ ద్వారా ఆదేశాలు అందుకున్న శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం అధికారులు ఇక నుంచి విధులకు రావొద్దని కార్మికులకు తెలిపారు. 2004 నుంచి పనిచేస్తున్న తనను ఉన్నపళంగా ఉద్యోగం నుంచి తొలగిస్తే ఏం చేయాలో దిక్కుతోచడం లేదని వాటర్‌మెన్ అనిల్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఉద్యోగంతోనే తాను భార్య, కుమారుడిని పోషించుకునేవాడినని, ఇప్పుడు జీవనం ఎలా సాగించాలో తెలియడం లేదని అన్నాడు. 2010 నుంచి గొల్లపల్లి పంప్‌హౌస్ వద్ద ఫిట్టర్‌గా పనిచేస్తున్న తనను ఇక డ్యూటీకి రావొద్దని అధికారులు తెలపడంతో గుండె ఆగినంత పనైందని బాలక్రిష్ణ తెలిపాడు. తనకు భార్య, ఆరు నెలల కుమార్తె ఉందని, ఉద్యోగం పోతే రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశాడు. ఏమైనా సందేహాలుంటే ఎమ్మెల్యే పీఏను సంప్రదించాలని సలహా ఇచ్చారన్నారు.

### పాలపాటిదిన్నెకు పోటెత్తిన భక్తులు



ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహం ఊరేగింపు

**నల్లచెరువు:** పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ మాస ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రావణ మాసం మొదటి శనివారం కావడంతో దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. స్వామిని దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యేను ఈఓ రవీంద్రరాజు సత్కరించి, స్వామి చిత్రపటాన్ని బహూకరించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

# పనులు చేసినా.. పస్తులే!



కొండంపల్లె వద్ద ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

- 'ఉపాధి' బిల్లుల చెల్లింపుల్లేవ్
- పెండింగ్‌లో రూ.56.5 కోట్ల బిల్లులు
- అవస్థలు పడుతున్న ఉపాధి కూలీలు

**పెనుకొండ రూరల్:** ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కూలీలు సకాలంలో కూలి డబ్బులు అందక పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది. వారానికొకసారి కూలి డబ్బు కూలీల ఖాతాల్లో జమ కావాలి. అయితే రెండు నెలలుగా చెల్లింపులు లేవు. దీంతో ఆర్థిక ఇబ్బందులు రెట్టింపయ్యాయి. జిల్లాలోని 468 గ్రామపంచాయతీల పరిధిలో 2.61 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. జాబ్‌కార్డుల్లోని 10.05 లక్షల మంది కూలీలు గడిచిన రెండు నెలల్లో చేసిన పనులకు సంబంధించి రూ.56.5 కోట్ల మేర కూలి రావాల్సి ఉంది. సార్వత్రిక ఎన్నికల వరకు వారంలో ఎంత పని చేస్తే అంత కూలి కూలీల ఖాతాలకు జమయ్యేవి. అయితే మే నెల నుంచి బిల్లులు రాలేదు. దీంతో కుటుంబ పోషణ భారంగా పరిణమించింది. ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎంపీడీఓలు, బ్యాంకులు, పోస్టాఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ వస్తున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని తమకు నెలల తరబడి కూలి రాకపోతే ఏం తిని బతకాలని కూలీలు ప్రశ్నిస్తున్నారు. రెండు నెలల కూలి వేతనాలకు గాను వారం రోజులకు సంబంధించిన మొత్తం జమ అయినట్లు పలువురు కూలీలు తెలిపారు. పూర్తిస్థాయిలో చెల్లింపులు చేసేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

### త్వరలో పరిష్కారం

సార్వత్రిక ఎన్నికల అనంతరం నూతన ప్రభుత్వం ఏర్పాటు ప్రక్రియలో భాగంగా కొంత వరకు ఉపాధి హామీ కూలీల వేతన బిల్లుల చెల్లింపులో ఆలస్యం జరిగిన మాట వాస్తవమే. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే సమస్య పరిష్కరించే విధంగా చూస్తాం.

– విజయప్రసాద్, డ్వామా పీడీ

### ఎప్పటికప్పుడు ఇవ్వాలి



పొట్టకూటి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఉన్న చోటే ఉపాధి దొరుకుతోంది. అయితే చేసిన పనికి సకాలంలో కూలి అందకపోతే ఇంట్లో అందరూ పస్తులుండాల్సి వస్తోంది. ఇప్పటికి రెండు నెలల మేర బిల్లులు పడాలి. అయితే ఇటీవల ఒక వారం రోజుల పని డబ్బులు మాత్రమే జమయ్యాయి.

– రామాంజినమ్మ, ఉపాధి కూలీ, మావటూరు

### కుటుంబం గడిచేదెట్లు..?



ఉన్న ఊరిలోనే పని దొరుకుతుందని ఉపాధి పనులు చేశాం. రెండు నెలలుగా కూలి ఇవ్వకుండా ఉంటే కుటుంబం ఎలా గడుస్తుంది..? చాలా ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్నాము. మాలాంటి వారిని నిర్లక్ష్యం చేయడం తగదు.

– రత్నమ్మ, ఉపాధి కూలీ, మావటూరు

# ఆమె సంకల్పానికి తలొగ్గిన విధి

Sunday Special

సమాజంలో మార్పు లేని జీవితాలే లేవని గ్రహించిన ఆమె... తనకు అపజయాలు కలిగిన చోటే గెలుపు పిలుపు వినిపించింది. చెమట నీరు చిందిస్తూ నుదుటి రాతను మార్చుకుంది. ఆమె సంకల్పం ఎదుట చివరకు విధి సైతం తలొగ్గింది. కష్టాల వారధి దాటాలని తలచుకుంటే సాధ్యం కానిది ఏదీ లేదని నిరూపించిన పెనుకొండ పుల్లమ్మ విజయ ప్రస్థానంపై 'సాక్షి' కథనం.

- భర్త అకాల మరణంతో ఒంటరైన మహిళ
- ముగ్గురు కుమార్తెల చదువు కోసం ఆటో డ్రైవర్‌గా రాణింపు

**తాడిమర్రి:** తాడిమర్రి మండలం మర్రిమాకులపల్లి ఎస్సీ కాలనీకి చెందిన తుంపిరి నారాయణ, తుంపిరి పెద్దక్క దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె పుల్లమ్మ చక్కగా చదువుకుంటూ 2008లో పదో తరగతి ఉత్తీర్ణత సాధించింది. తల్లిదండ్రులు ఆమెను ఇంటర్‌లో చేర్పించాలని భావించారు. ఇంతలో తన తల్లి పెద్దక్క తమ్ముడు పెనుకొండ రామకృష్ణ భార్య అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటికే రామకృష్ణ దంపతులకు ఓ కుమార్తె ఉంది. ఈ క్రమంలో ఆ పాప బాగోగులు చూసేందుకు రామకృష్ణకు మరో పెళ్లి చేయాలని పెద్దక్క, కుటుంబ సభ్యులు భావించారు. అయితే వేరే వారితో వివాహం జరిపితే వచ్చిన మహిళ తమ్ముడి కుమార్తెను సరిగా చూసుకోదేమోనన్న భయం పెద్దక్కను వెన్నాడింది. దీంతో తన కుమార్తె పుల్లమ్మను ఇచ్చి వివాహం చేయాలనుకుని పెద్దక్క నిశ్చయించుకుంది. ఇదే విషయాన్ని పుల్లమ్మకు తల్లిదండ్రులు తెలిపారు. ఆ సమయంలో పుల్లమ్మ తనకు చదువుకోవాలని ఉందని తెలిపినా వినకుండా మేనమామతో పెళ్లి జరిపించేశారు.



ప్రయాణికులను ఆటోలో తీసుకెళ్తున్న పుల్లమ్మ

**భర్త అకాల మరణంతో జీవితం కుదేలు**

ధర్మవరం మండలం బుడ్డారెడ్డిపల్లికి చెందిన పెనుకొండ రామకృష్ణతో వివాహమైన తర్వాత పుల్లమ్మకు ఇద్దరు కుమార్తెలు కలిగారు. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తూ ముగ్గురు ఆడపిల్లలనూ చక్కగా పోషించుకునేవారు. ఎంతో సంతోషంగా సాగిపోతున్న వారి జీవితాన్ని విధి వెక్కిరించింది. 2016, ఆగస్టు 26న అనంతపురం రూరల్ మండలం మన్నీల వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో రామకృష్ణ మృతి చెందాడు. భర్త అకాల మరణంతో పుల్లమ్మకు దిక్కుతోచలేదు. కంటి ముందు అంతా చీకటిగానే కనిపించసాగింది. ముగ్గురు చిన్నారులను ఎలా పోషించుకోవాలో తెలియక రోదించని రోజంటూ లేదు. ఈ క్రమంలో ఒంటరి బతుకు పోరు ఆమెను మరింత భయపెట్టింది. ఆత్మహత్య తప్ప మరో మార్గం ఆమెకు కనిపించలేదు. అదే సమయంలో కాళ్లకు పెనవేసుకుని అమాయకంగా నిద్రిస్తున్న ముగ్గురు కుమార్తెలను చూసి ఆమె గుండె చెరువైంది. తాను మరణిస్తే చిన్నారులు అనాథలవుతారని భావించిన ఆమె ఎలాగైనా పిల్లలను ప్రయోజకులను చేసి తీరాలని భావించింది. విధిని ఎదిరిస్తూ తన తల రాతను మార్చుకునేందుకు సిద్ధమైంది.

### ఆర్డీటీ సాయం మరువలేను

నా భర్త రోడ్డు ప్రమాదంలో మరణించిన తర్వాత నాకు దిక్కుతోచలేదు. ఎలా బతకాలి.. ముగ్గురు ఆడపిల్లలను ఎలా పోషించుకోవాలో అని చాలా బాధపడ్డాను. అమాయకంగా నా కాళ్ల చుట్టూ తిరుగుతున్న పిల్లలను చూస్తే గుండె తరుక్కుపోయేది. ఆ సమయంలోనే ఆర్డీటీ సార్లు నా ఇంటి వద్దకు వచ్చి నాకు ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆటో డ్రైవింగ్ నేర్పడమే కాక, ఓ ఆటోను కూడా తీయించి ఇచ్చారు. ఆర్డీటీ సాయం మరువలేను. కొంత మేర ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా.. పిల్లల చదువులకు ఢోకా లేకుండా చూసుకుంటున్నా.

– పెనుకొండ పుల్లమ్మ, మర్రిమాకులపల్లి, తాడిమర్రి మండలం

### ఆర్డీటీ సహకారం అందిపుచ్చుకుని...

భర్త మరణానంతరం ఒంటరిగానే కూలి పనులతో ముగ్గురు కుమార్తెలను చదివించుకుంటున్న పుల్లమ్మ స్ఫూర్తిదాయక జీవితాన్ని తెలుసుకున్న ఆర్డీటీ అధికారులు ఆమెకు అండగా నిలిచారు. ఆమెలో ఆత్మవిశ్వాసం పెంపొందించారు. అనంతపురంలో మూడు నెలల పాటు ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చి సొంతంగా ఆటో కొనుగోలుకు సహకారం అందించారు. అప్పటి నుంచి ఆటో నడుపుతూ ముగ్గురు పిల్లలను ఆమె చక్కగా చదివించుకుంటోంది. మర్రిమాకులపల్లిలో తల్లిదండ్రుల వద్ద ఉంటూనే ఉదయం 6 గంటలకే ప్రయాణికులతో గ్రామం నుంచి 33 కిలోమీటర్ల దూరంలోని ధర్మవరానికి వెళుతుంది. అక్కడ పగలంతా ఆటో నడిపి తిరిగి సాయంత్రం 6 గంటలకు స్వగ్రామం చేరుకుంటుంది. ఈ క్రమంలో ఎన్నో అవమానాలను ఆమె చవిచూడాల్సి వచ్చింది. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం అన్నింటినీ భరిస్తూ వచ్చింది. ప్రస్తుతం పెద్ద కుమార్తె పావని మైసూరులో డిప్లొమా చేస్తోంది. రెండో కుమార్తె నాగజ్యోతి ఇంటర్, చిన్న కుమార్తె నాగమణి 9వ తరగతి చదువుతున్నారు.



ముగ్గురు కుమార్తెలతో పుల్లమ్మ

## క్లుప్తంగా

### మేకల మందపై చిరుత దాడి



చిరుత దాడిలో మృతి చెందిన మేక

కంబదూరు: మండల కేంద్రం సమీపంలో శనివారం ఓ చిరుత మేకల మందపై దాడి చేసింది. ఘటనలో ఓ మేక మృతి చెందింది. బాధితుడి వివరాల మేరకు... మండల కేంద్రానికి చెందిన మిరియాలు వెంకటేశులు ఉదయం మల్లేశ్వర స్వామి ఆలయ సమీపంలోకి మేకలను మేత కోసం తీసుకెళ్లాడు. సమీపంలోని కొండలో నుంచి వచ్చిన ఓ చిరుత మేకల మందపై దాడి చేసింది. వెంటనే చుట్టు పక్కల ఉన్న కాపరులు గమనించి కేకలు వేయగా చిరుత మేకలను వదిలేసి వెళ్లిపోయింది. ఘటనలో ఓ మేక మృతి చెందగా రెండు గాయపడ్డాయి. రూ.20 వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత కాపరి తెలిపారు. సంఘటన స్థలాన్ని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రామేశ్వరమ్మ పరిశీలించారు.

### 38 మంది ఎంపీడీఓలకు పోస్టింగ్

అనంతపురం సిటీ: సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇతర జిల్లాలకు వెళ్లి, ప్రస్తుతం సొంత జిల్లాకు తిరిగొచ్చిన 38 మంది ఎంపీడీఓలకు పోస్టింగ్ ఇచ్చారు. వీరిలో అనంతపురం జిల్లాకు 13 మంది, శ్రీసత్యసాయి జిల్లాకు 25 మందిని కేటాయించారు. వీరికి మండలాలు కేటాయిస్తూ శనివారం రాత్రి జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ ప్రభాకర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా సోమవారం విధుల్లోకి చేరిపోవాలని ఆదేశించారు. అనంతపురం జిల్లాకు సంబంధించి కె.తేజోత్స్న బుక్కరాయ సముద్రం, ఎస్.షకీలాబేగం బొమ్మనహాళ్, విజయభాస్కర్ గార్లదిన్నె, ఎస్.నరసింహమూర్తి గుమ్మఘట్ట, పీడీ శ్రీనివాసులు కణేకల్లు, జి.లక్ష్మీ నరసింహ కుందుర్పి, డి.ప్రభాకర్ పామిడి, బి.రామకృష్ణ పెద్దపప్పూరు, పి.కుళ్లాయిస్వామి పెద్దవడగూరు, టి.యోగానందరెడ్డి పుట్లూరు, బి.నిర్మలకుమారి శింగనమల, ఎ.వెంకటరంగారావు తాడిపత్రి, పి.దివాకర్ నార్పల, జె.సాల్మన్ రాప్తాడు, ఎ.వి.శ్రీనివాసులు విడపనకల్లు, టి.లక్ష్మీనారాయణ యాడికి, జీఎస్ రామచంద్ర బెళుగుప్ప మండలానికి నియమితులయ్యారు.

- శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి బి.శకుంతల నల్లచెరువు, ఎం.కొండన్న నల్లమాడ, బీవీ రవి ప్రసాద్ అగళి, జి.మునెప్ప అమడగూరు, ఎస్.సాయి మనోహర్ బత్తలపల్లి, ఎస్.గంగావతి చెన్నేకొత్తపల్లి, నరేశ్ కృష్ణ చిలమత్తూరు, డి.రామారావు గుడిబండ, పి.నరేంద్రకుమార్ హిందూపురం, టి.అలివేలమ్మ కనగానపల్లి, ఎస్.బారాన్ సాహెబ్ కొత్తచెరువు, ఎం.నరసింహనాయుడు లేపాక్షి, సీఎల్ సోనీబాయి మడకశిర, కె.వి.కవిరాజు ముదిగుబ్బ, ఎస్.సరస్వతి పరిగి, ఎస్.శివశంకరప్ప పెనుకొండ, డి.రాబర్ట్ విల్సన్ రొద్దం, కె.ఆజాద్ రొళ్ల, బి.విజయలక్ష్మి తాడిమర్రి, బి.కిరణ్ మోహన్‌రావు తలుపుల, ఎస్.రఘునాథగుప్త గోరంట్ల మండలానికి నియమితులయ్యారు.

# ప్రభుత్వ ఆదేశం.. 'తమ్ముళ్ల'కు ఆదాయం!

- అహుడా అనుమతి తప్పనిసరంటున్న ప్రభుత్వం
- అనుమతులు లేని వెంచర్లపైన చర్యలకు ఆదేశం
- ఫ్రీహోల్డ్ జీవో కింద రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని మౌఖిక ఆదేశాలు
- ప్రతి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 'తెలుగు తమ్ముళ్ల' దందా



ధర్మవరంలో అనధికారికంగా వేసిన వెంచర్

ధర్మవరం: ప్రభుత్వ ఆదేశాలను తెలుగు తమ్ముళ్లు ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. అహుడా అనుమతి లేని వెంచర్లు, ఫ్రీహోల్డ్ రైట్స్ భూముల విషయంలో దందాకు తెరలేపినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం అక్రమ లే అవుట్లపై చర్యలకు సిద్ధమవుతోంది. గతంలో వేసిన అక్రమ లేఅవుట్‌ల వివరాలను పంపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లుగా తెలుస్తోంది. మరోవైపు గత ప్రభుత్వంలో పేదలకు ఎంతో మేలు చేసేలా అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన ఫ్రీహోల్డ్ రైట్స్ భూములకు రిజిస్ట్రేషన్లు చేయకూడదంటూ మౌఖిక ఆదేశాలు ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అందాయి. ఇంకేముంది ప్రభుత్వ ఆదేశాలను అధికార పార్టీ నాయకులు ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పెత్తనం చెలాయిస్తూ డబ్బు తీసుకుని వారు చెప్పిన వారికి మాత్రమే రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా ధర్మవరం, కదిరి, హిందూపురం, పెనుకొండ, రాప్తాడు, మడకశిర నియోజకవర్గాల్లో వేలాది వెంచర్లు అక్రమంగా వేసి ప్రజలకు ప్లాట్లు విక్రయించారు. దశాబ్దకాలంగా ఈ తంతు జరుగుతూనే ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అక్రమ లేఅవుట్ల నిర్మూలనకు ఎన్నో చర్యలు తీసుకుంది. ప్రజలకు ఉపయుక్తంగా ఉండేలా ఎంఐజీ లేఅవుట్లను అందుబాటులోకి తెచ్చింది.

**ప్లాట్లు కొన్నవారికే నష్టం**

గతంలో జిల్లాలో వేసిన అక్రమ లేఅవుట్‌లపై ప్రభుత్వం ఆరా తీస్తోంది. జిల్లాలో అక్రమ లేఅవుట్‌లు ఎన్ని ఉన్నాయి? వాటిలో ల్యాండ్ కన్వర్షన్ చేసి వేసిన వెంచర్‌లు ఎన్ని? అనే వివరాలను సమగ్రంగా పంపాలని రిజిస్ట్రేషన్, అహుడా, మున్సిపల్, పంచాయితీ అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందినట్లు సమాచారం. వీటిపై భారీ స్థాయిలో జరిమానాలు వేసి క్రమబద్ధీకరించేలా చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. ఇదే కనుక జరిగితే అక్రమ లేఅవుట్లు వేసి రూ.కోట్లు సంపాదించిన రియల్టర్లకు ఎటువంటి నష్టమూ ఉండదు. కష్టపడి సంపాదించిన డబ్బుతో ప్లాట్లు కొన్న పేద, మధ్య తరగతి ప్రజలకు తీవ్ర నష్టం జరగనుంది.

**ఫ్రీహోల్డ్ జీఓకు మంగళం!**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న రైతులకు మేలు చేసేలా 2004కు ముందు అసైన్డ్ చేసిన భూములకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ ఇచ్చిన ఫ్రీహోల్డ్ రైట్స్ జీఓ అమలు చేయొద్దని ఆఫ్ ద రికార్డు ఆదేశాలు ఇచ్చినట్లుగా సమాచారం. దీంతో ఆయా భూములకు సంబంధించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తిష్ట

అహుడా అనుమతి లేని వెంచర్లు, ఫ్రీహోల్డ్ రైట్స్ భూముల విషయంలో ప్రభుత్వ ఆదేశాలు అధికార పార్టీ నాయకులకు ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. ఇప్పటికే అధికార పార్టీల నాయకులు గ్రూప్‌లుగా ఏర్పడి మండలానికి ఒకరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తిష్ట వేశారు. వారు ఎవరిపేర్లు చెప్పి డబ్బు ముట్టచెబుతారో వారి భూములు, ప్లాట్లు మాత్రం రిజిస్ట్రార్ చేసేలా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో వారు చేసేది లేక అధికార పార్టీ నాయకుల ఆదేశాలు శిరసా వహిస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి చూడలేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తాము కష్టపడి సంపాదించిన డబ్బుతో ఎదైన ప్లాటో, భూమి కొనాలంటే కప్పం కట్టాల్సి రావడం చాలా బాధగా ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



ధర్మవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

## ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం



వైఎస్సార్‌టీఏ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

- వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి
- వైఎస్సార్‌టీఏ నూతన కార్యవర్గం ఎన్నిక

పుట్టపర్తి అర్బన్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేస్తామని వైఎస్సార్‌టీఏ నాయకులు పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తి ఎమ్మార్సీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జంషీద్ ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్సార్‌టీఏ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా పీవీ రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.ఇంద్రప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఎన్నికల హామీలను తక్షణం అమలు చేయాలని, జీఓ 53 ప్రకారం ఏ మండలంలో మిగులు ఉపాధ్యాయులు ఉంటారో అదే మండలంలో అవసరమైన చోట సర్దుబాటు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను తగ్గించాలని, పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, నెలనెలా పదోన్నతులు చేపట్టాలన్నారు. అనంతరం యూనియన్ గుర్తింపు కోసం నిర్విరామంగా కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడిని ఘనంగా సత్కరించారు. నాయకులు అలీ, ప్రతాప్‌రెడ్డి అనంతపురం జిల్లా నేతలు గోవిందరెడ్డి, రమణ, ప్రసాద్‌రెడ్డి, ప్రభాకరరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, మధు, రామమోహన్‌రెడ్డి, రామిరెడ్డి, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, రాజగోపాల్, సుదర్శన్‌రెడ్డి, సురేష్, జయరామిరెడ్డి, కేశవరెడ్డి, కృష్ణారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, ఓంప్రకాష్, జమీర్, శ్రీనివాసరెడ్డి, మధుసూధనరెడ్డి తదితరులు ఉన్నారు.

## పావగడలో 'శ్రావణ' సందడి



మూల విరాట్ శనీశ్వర స్వామి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు



శనీశ్వరస్వామి దర్శనానికి క్యూలో వెళ్తున్న భక్తులు

పావగడ: స్థానిక శనీశ్వరస్వామి ఆలయంలో తొలి శ్రావణ శనివారం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచే శని దేవుడి దర్శనానికి వేలాది మంది భక్తులు బారులుదీరారు. ప్రధాన అర్చకుడు కృష్ణశాస్త్రి శని మహాత్ముడికి కలశ స్థాపన, గణపతి పూజ, నవగ్రహ పూజలు, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, తైలాభిషేకం, కుంకుమార్చన, ప్రాకారోత్సవం నిర్వహించారు. ప్రత్యేక భవనంలో ఏర్పాటు చేసిన నవగ్రహ పూజలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

శని దోష నివారణ పూజల్లో సైతం పలువురు భక్తులు పాల్గొన్నారు. శీతలాంబదేవి అమ్మవారిని దర్శించుకుని సహస్ర కుంకుమార్చన చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ సమితి పదాధికారులు, ఆలయ సిబ్బంది, వలంటీర్లు చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ సురేశ్ నేతృత్వంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ధర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు

- అరగంట పాటు ప్రొద్దుటూరు స్టేషన్‌లో ఆగిన రైలు
- భయాందోళనతో పరుగులు తీసిన ప్రయాణికులు

అనంతపురం సిటీ: ధర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. దీంతో రైలును మార్గమధ్యంలోని వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు రైల్వేస్టేషన్‌లో అరగంట పాటు ఆపేశారు. అనంతపురం రైల్వే అధికారులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన సమాచారం ప్రకారం ... శుక్రవారం రాత్రి ధర్మవరం నుంచి అనంతపురం మీదుగా మచిలీపట్నం బయలుదేరిన రైలు మార్గమధ్యంలోని ప్రొద్దుటూరుకు చేరుకునే సరికి బాగా పొద్దుపోయింది. స్టేషన్‌లో ఆగేందుకు లోకో పైలెట్ బ్రేక్ వేసే సమయంలో ఏసీ బోగీ వద్ద ఒక్కసారిగా పొగ వచ్చింది. స్టేషన్ ఆవరణమంతా ఆవరించింది. ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. వర్షం పడడం, బ్రేకులను పదేపదే వేయడంతో ఏసీ బోగీ చక్రాల కింద పొగ వచ్చినట్లు రైల్వే అధికారులు గుర్తించారు. దీనివల్ల ఎటువంటి ప్రమాదమూ లేదని ప్రకటించారు. అరగంట ఆలస్యంగా రైలు మచిలీపట్నం బయలుదేరింది.

## పండుగలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

గుంతకల్లు: పంద్రాగస్టు, వరలక్ష్మీ వ్రతం, రాఖీ పండుగల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రాయలసీమ జిల్లాల మీదుగా ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ శనివారం తెలిపారు. ఈ నెల 14, 16 తేదీల్లో కాచిగూడ-తిరుపతి మధ్య (07653) ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. కాచిగూడ జంక్షన్ నుంచి రాత్రి 10.30 గంటలకు రైలు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.25 గంటలకు తిరుపతి జంక్షన్ చేరుతుంది. 15, 17వ తేదీల్లో రాత్రి 7.50 గంటలకు తిరుపతి జంక్షన్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు కాచిగూడ జంక్షన్‌కు చేరుతుంది. షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల్, కర్నూలు, డోన్, గుత్తి, యర్రగుంట్ల, కడప, రేణిగుంట మీదుగా వెళ్తుంది.

- ఈ నెల 14, 15వ తేదీల్లో తిరుపతి-నాగర్‌సోల్ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తాయి. 14న తిరుపతి రైల్వేస్టేషన్ (07417) నుంచి ఉదయం 8.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10 గంటలకు రైలు నాగర్‌సోల్ చేరుతుంది. 15వ తేదీ నాగర్‌సోల్ రైల్వే స్టేషన్ (07418) నుంచి రాత్రి 10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10.30 గంటలకు తిరుపతి జంక్షన్‌కు చేరుతుంది.
- 17,18వ తేదీల్లో తిరుపతి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఏర్పాటు చేశారు. 17వ తేదీ తిరుపతి జంక్షన్ (07489) నుంచి సాయంత్రం 5.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.25 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్ చేరుతుంది. 18న సికింద్రాబాద్ జంక్షన్ (07490) సాయంత్రం 6.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి జంక్షన్ చేరుతుంది. రేణిగుంట, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూర్, కృష్ణ, యద్గిరి, చిత్తపూర్, తాండురూ, వికారాబాద్, లింగంపల్లి మీదుగా రైళ్లు రాకపోకలు సాగిస్తాయి.
- 19న తిరుపతి-నాందేడ్ మధ్య వన్‌సైడ్ స్పెషల్ ట్రైన్ నడుస్తుంది. సాయంత్రం 5.15 గంటలకు తిరుపతి జంక్షన్ (07417) నుంచి బయలుదేరే రైలు రేణిగుంట, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూర్, లింగంపల్లి, సికింద్రాబాద్, మేడ్చల్, కామరెడ్డి, నిజామాబాద్, ధర్మబాద్ మీదుగా నాందేడ్‌కు మరుసటి రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు చేరుతుంది.

## మేకల కాపరిపై ఎలుగుబంటి దాడి

శెట్టూరు: లక్ష్మంపల్లిలో శనివారం ఓ మేకల కాపరిపై ఎలుగుబంటి దాడి చేసింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మేకల కాపరి సోమనాథ ఉదయం మేకలను మేతకోసం ఊరి బయటకు తీసుకెళ్లాడు. పొదల చాటున ఉన్న ఎలుగుబంటి ఒక్కసారిగా సోమనాథపై దాడికి యత్నించింది. ఈక్రమంలో వెనుకవైపు చిన్నగాట్లు పడగా చొక్కా చినిగిపోయింది. భయాందోళనకు గురైన అతడు అక్కడి నుంచి పారిపోయాడు. ఎలుగుబంట్ల నుంచి తమకు రక్షణ కల్పించాలని పశువుల కాపరులు కోరుతున్నారు.

# తేరుకుంటున్న ఖరీఫ్ పంటలు



తేరుకున్న వేరుశనగ పంట



పచ్చగా మారిన కంది పంట



అనప పంట

- మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో 3 రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ పంటలు తేరుకుంటున్నాయి. ఖరీఫ్ ప్రారంభంలో నైరుతి రుతుపవనాల వల్ల విస్తారంగా వర్షాలు కురవడంతో సాగు మొదలుపెట్టారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా సరైన వర్షాలు లేక సాగైన పంటలన్నీ వాడుముఖం పట్టాయి. దీంతో రైతులు ఆందోళన చెందారు. గడిచిన ఐదేళ్లలో ఏనాడూ ఇంతలా పంటలు ఎండలేదని తీవ్రంగా మదనపడ్డారు. అయితే మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. అందులో గురువారం జిల్లాలోని 22 మండలాల్లో మంచి వర్షమే నమోదైంది. అయితే ఇంకా పూర్తిగా ఆందోళన పోలేదని రైతులు పేర్కొంటున్నారు.

**లక్ష హెక్టార్లు దాటిన సాగు**

ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 32 మండలాల్లో లక్ష హెక్టార్ల విస్తీర్ణంలో పంటల సాగు దాటినట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఇందులో అత్యధికంగా వేరుశనగ 65 వేల హెక్టార్లలో, కంది 15,055 హెక్టార్లలో సాగైంది. మొక్కజొన్న 7 వేల హెక్టార్లు, సజ్జ, అలసంద, అనప, రాగి ఉలవ పంటలు సాగులోకి వచ్చాయి. ప్రస్తుతం పంటలు పూత దశకు చేరుకున్నాయి. ఈ నెల ఏడో తేదీన 26 మండలాల్లో ఆరు మి.మీ, ఎనిమిదో తేదీన ఆరు మండలాల్లో రెండు మి.మీ, తొమ్మిదో తేదీన 22 మండలాల్లో 9.8 మి.మీ మేర వర్షపాతం నమోదైంది. వాడుముఖం పట్టిన పంటలు ఈ వర్షాలకు తేరుకున్నాయని రైతులు చెబుతున్నారు. ఇకపై అడపాదడపా వర్షాలు కురిసినా పంట చేతికొస్తుంది.

## మూడు టిప్పర్లు, జేసీబీల స్వాధీనం

తాడిపత్రి రూరల్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్లు, జేసీబీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. తాడిపత్రి మండలంతో పట్టణ సమీపంలో శనివారం సాయంత్రం పోలీసు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు జరిపారు. ఈసందర్భంగా కొత్త బ్రిడ్జి వద్దనున్న గంగమ్మ ఆలయం వెనుక భాగంలో డంప్ చేసిన ఇసుక తరలిస్తున్న టీడీపీకి మద్దతుదారులకు చెందిన మూడు టిప్పర్లు, జేసీబీలను పట్టుకుని రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

# ఆ నటనకు వన్స్‌మోర్!

- పౌరాణిక నాటకాల్లో రాణిస్తున్న ఉక్కడం రవి
- ఖ్యాతి తెచ్చిన మాయల ఫక్కీర్, వీరబాహుడి పాత్రలు



మాయలమరాఠి పాత్రలో అలరిస్తున్న రవి



వీరబాహుడు వేషంలో రవి

చెన్నేకొత్తపల్లి: ఆయన వేషం కడితే రంగస్థలం దద్దరిల్లుతుంది. ఆ అభినయానికి ఎవరైనా ఫిదా కావాల్సిందే. పాత్రకు తగిన శరీక సౌష్టవంతో తన నటనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్న ఆయనే... ఉక్కడం రవి. చెన్నేకొత్తపల్లి మండలం ముష్టికోవెల పంచాయతీ సుబ్బరాయనిపల్లికి చెందిన రవి... పదో తరగతి వరకూ చదువుకున్నారు. పౌరాణిక నాటకాలంటే అమితాసక్తి కలిగిన ఆయన చిరుప్రాయం నుంచే వీధి నాటకాల్లో నటిస్తూ వచ్చారు.

**ప్రజా కళాకారుడిగా...**

ప్రజాగాయకుడు గద్దర్ వద్ద గాయకుడిగా శిక్షణ తీసుకున్న ఆయన అభ్యుదయ భావజాలంతో సమాజంలోని పలు రుగ్మతలను పారదోలేందుకు శ్రమిస్తూ వచ్చారు. ఓ ప్రజా కళాకారుడిగా ఎదిగిన రవి... అనంతరం కళాకారులతో కలసి అంటరానితనం నిర్మూలన, వరకట్న దురాచారం, మహిళా వేధింపులు, సామాన్య ప్రజల కష్టాలు, రైతు ఆత్మహత్యలు, ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వీధి నాటకాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేశారు. ఈ క్రమంలోనే రంగస్థలంపై మక్కువ పెంచుకున్నారు. మాయల మరాఠి (బాలనాగమ్మ), వీరబాహుడు (సత్యహరిశ్చంద్ర), భీముడు, దుర్యోధనుడు తదితర పాత్రల్లో తనదైన అభినయంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఆధునిక సాంకేతికత కారణంగా సినిమాలు, టీవీలు, సెల్‌ఫోన్లు పెరిగి పౌరాణిక నాటకాలకు ఆదరణ తగ్గుతోందని, ఇలాంటి తరుణంలో కళాకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని ఆయన కోరుతున్నారు.